# స్వార్జితం

టి. శ్రీవల్లీ రాధిక

**దూరం నుంచే కనిపిస్తున్నాయి బిల్డింగ్స్.**

**తెలుపు ఆకుపచ్చ రంగుల కాంబినేషన్.**

**చుట్టూ ఈ చివరి నుంచి ఆ చివరిదాకా... ఆకాశాన్నంటుతూన్నట్లుగా ఉన్న చెట్లు.**

**నిలువెత్తు పుట్టల మధ్య ఘోరతపస్సులో మునిగిపోయిన మౌనిలా ఉంది కాలేజ్.**

**"ఎన్నాళ్లయింది ఇక్కడికి వచ్చి!" రెండు... మూడు ... దాదాపు నాలుగు సంవత్సరాలు.**

"ఒకప్పుడు ఇవే పరిసరాలలో తిరిగేవాళ్లు. నవ్వులతో... కేరింతలతో... గొడవలతో ...

"ఎంత అల్లరి చేసేవాళ్లు !

"కాలేజ్ నుంచి బస్‌స్టాప్‌కి వెళ్లడం. బస్‌స్టాప్ నుండి కాలేజ్‌కి రావడం. నిజంగా అదంతా రాస్తే ఓ కావ్యం. చెప్పుకుంటే మరో భారతం.

"ఎలా చేసేవాళ్లో ఇంత బిజీ రోడ్డు మీద అంత అల్లరి!"

కణకణలాడుతున్న ఎండలో నడుస్తూ గతాన్ని గుర్తు చేసుకుంది రజని. చెవులు చిల్లులు పడేలా శబ్దం చేస్తూ చీమల్లా తిరిగే బస్సులూ, కార్లూ.. రద్దీ విపరీతమైన ఎండ!

రోడ్డు మీద ఎక్కడా ఒక్క చెట్టు కూడా లేకపోవడం వల్లనేమో, ఇక్కడ ఎండ మాడ్చేస్తూంది. అసలే నీరసంగా ఉంది. ఎండలో నడుస్తుంటే మరీ కళ్లు తిరుగుతున్నట్లనిపిస్తోంది.

ఎలాగోలా కాలేజ్ మెయిన్‌గేట్ చేరుకుంటే చాలు. ఇక అక్కడి నుంచి చల్లగా హాయిగా ఉంటుంది.

చెట్ల మధ్యగా.... పచ్చటి లాన్‌లో నుంచి అలా నడుచుకుంటూ వెళ్లడం... రంగు రంగుల డ్రెసెస్‌లో అటూ ఇటూ తిరిగే పువ్వుల్లాంటి అమ్మాయిలని చూడడం!

ఆస్వాదించడం తెలియాలిగానీ ఉమెన్స్ కాలేజ్ కన్నా అందమైన ప్రదేశం ప్రపంచంలో మరేముంటుంది!

ఎదురుగా వస్తూన్న అమ్మాయిని చూసి అప్రయత్నంగా ఒక్క క్షణం ఆగింది రజని. ఎవరో ఆ అమ్మాయి? చాలా బాగుంది.

లేత గులాబీ రంగు ప్లెయిన్ చుడీదార్. పైన అంతా సాదాగా ఉండి కింద కుచ్చులు ఉన్నాయి. ఇప్పటి ఫాషన్ కాబోలు. మెత్తటి క్లాత్ సన్నటి ఆమె నడుముని అంటి పెట్టుకుని కళ్లు తిప్పుకోనివ్వడం లేదు.

అందంగా ఊగుతూన్న పోనీటెయిల్. ఎత్తైన గుండెల మీద షో బటన్... ఆనందంతో కళకళలాడిపోతున్నట్లుగా ఉంది ఆ అమ్మాయి మొహం.


పరిసరాల స్పృహ ఉన్నట్లు లేదు.

తనలో తనే ముసిముసిగా నవ్వుకుంటోంది. అలా నవ్వుతూనే రజనిని దాటి వెళ్లిపోయింది.

"ఎంత ఆనందంగా ఉంది ఆ అమ్మాయి! తనూ అలాగే ఉండేది నాలుగేళ్ల క్రితం.

"గులాబీలు పూసే బుగ్గలతో... కలల భారంతో వాలిపోయే కళ్లతో.

"ఇప్పుడు!!



"ఇప్పుడు ఆ హుషారూ లేదు. ఆ కలలూ లేవు. రొటీన్ లైఫ్" నిట్టూర్చింది రజని.

ప్రతి రోజూ ఒకే రకంగా గడిచిపోతూంది. మొదట్లో ఏమీ తోచడం లేదంటే "మంచి మంచి పుస్తకాలు చదువుకో, సినిమాలు చూడు" అని సలహాలు ఇచ్చేవాడు మాధవ్.

'పోనీ ఇవేవీ కాదంటే ఏదన్నా ఉద్యోగం చేయి' అనేవాడు అదేదో చాలా చిన్న వ్యవహారంలా.

ఆమెకు చిర్రెత్తుకొచ్చేది. "ఆఁ ఇంక అదొక్కటే తక్కువయింది" అనేది అసహనంగా.

మాధవ్ ఆమెవైపు ఒకసారి సీరియస్ చూసే

కారం కారం కథా ప్రభ



వాడు.

'ఇలా అయితే చాలా కష్టం రజనీ. నేను సంపాదించేదంతా నీ సుఖం కోసమే. నీకు సుఖపడడం చేతకాకపోతే నేనేం చేయను చెప్పు!' అనేవాడు.

"ఒక్క విషయం గుర్తుపెట్టుకో. సుఖమూ, ఆనందమూ ఎక్కడో ఉండవు. కష్టపడడంలోనూ ఎదగడంలోనూ ఉంటాయి. చివరి రెండూ చేయడానికి నువ్వు ఇష్టపడకపోతే మొదటి రెండూ నీకు దొరకవు" అని చెప్పేవాడు.

అతను అలా కోపంగా మాట్లాడితే ఆమెకి ఇంకా ఏడుపొచ్చేది. తన ఒంటరితనాన్ని అర్థం చేసుకోకుండా ఏదేదో చెప్తారేమిటి అనిపించేది.

"ఇలా ఉపన్యాసాలివ్వడం మాత్రం బాగా తెలుసు" అనేది ఉక్రోషంగా.

మాధవ్ నవ్వేసేవాడు. ఆమె ఏడుపు మొహం పెడితే ఇంకేం మాట్లాడేవాడు కాదు. చాలా ఆవేశంగా దగ్గరకి తీసుకునేవాడు.

నీళ్లు నిండిన కళ్ల మీదా, బుగ్గల మీదా ముద్దుల వర్షం కురిపించి "నిజమే నీతో ఇంతసేపు డిస్కషన్స్ ఏమిటి నా కసలు. అంతకన్నా ముఖ్యంగా చేయాల్సిన పనులు చాలా ఉండగా." అనేవాడు చెవిలో అల్లరిగా.

మర్నాటి నుంచీ మళ్లీ మామూలు. ఆమె అసంతృప్తీ, దిగులూ ఇలాగే ఉండేవి.

మాధవ్ ఉద్యోగమూ, హడావుడీ అలాగే ఉండేవి.

"ఇదేమిటి! ఎంత నడిచినా ఈ దూరం తరగడం లేదు!" నుదుటి మీది చెమటను కర్చీఫ్‌తో అద్దుకుంటూ అనుకుంది రజని. ఇంకో నాలుగడుగులు వేశాక, ఓ పక్కగా కనిపించింది ఆమెకి పబ్లిక్ టెలిఫోన్.

"కొత్తగా పెట్టినట్లున్నారు ఇక్కడ. కాలేజ్‌లో ఫోన్ ఉంటే ఎంత హాయి! పిల్లలందరికీ ఎంత ఉపయోగం!"


పాత రోజులు గుర్తొచ్చాయి రజనికి.

అప్పట్లో మాధవ్‌కి ఫోన్ చేయాలంటే ఎంత ప్రాబ్లమ్ అయ్యేదో! కాలేజ్ బయటకి రావడానికే పావుగంట పట్టేది.

షాపులలో నుంచి, హోటల్స్‌లో నుంచి చేయాలంటే బెరుకుగా ఉండేది.

లంచ్ టైంలో గబగబా అన్నం తినేసి తనూ, సరితా పరుగెత్తుతున్నట్లుగా బయటికి వచ్చేవాళ్లు.

"ఏమిటే ఈ బాధ! నీ బాయ్‌ఫ్రెండ్‌కి నువ్వు




ఫోన్ చేస్తుంటే మధ్యలో నాకు కష్టాలు ఏమిటే!" అనేది ఆమె ఆయాసపడుతూ. సరితతోనే బాగా క్లోజ్‌గా ఉండేది తను. తన ప్రేమ వ్యవహారం మొత్తం క్షుణ్ణంగా తెలిసింది సరితకి ఒక్కదానికే.

అందుకే అదలా నిష్ఠురాలాడితే తను నవ్వేసేది. భుజాల చుట్టూ చేయి వేసి బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టుకునేది.

... రజని కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి.

"ఎక్కడుందో ఇప్పుడు సరిత!"

పాత రోజులు గుర్తొస్తున్న కొద్దీ ఆమె దుఃఖం మరీ పెరుగుతోంది.

"ఏమైపోయింది తనలో ఆ ఆనందమంతా! ఆ హుషారంతా ఏమైపోయింది?

"ఇప్పుడు ప్రతిరోజూసూర్యోదయమవుతుంది. మధ్యాహ్నమవుతుంది. సాయంత్రమవుతుంది. నిట్టూర్పులు కూడా విసుగు చెందేలా చీకటి పడుతుంది. చెప్పలేనంత చిరాకుతో మళ్లీ తెల్లవారుతుంది.

"ఎందుకు! ఎందుకిలా అయిపోయింది తన జీవితం!!

"మాధవ్‌ని పెళ్లి చేసుకునే రోజున ఎన్ని ఊహించుకుంది! జీవితమంతా నందనవనంలా ఉంటుందనుకుంది."

దుఃఖంతో రజని పెదవులు వణికాయి.

"పెళ్లి చేసుకుని పొరపాటు చేసిందా తను! దానివల్లనే తన ఆనందమంతా ఇలా హరించుకుపోయిందా!

"మరి మాధవ్ ఆనందంగానే ఉంటాడే! అవును ఈ రోజుకీ మాధవ్ ఆనందంగానే ఉంటాడు"

పెళ్లికి ముందులాగానే... ఉహు అంతకన్నా ఎక్కువగానే ఆనందంగా ఉంటాడు. కానీ తన విషయం మాత్రం ఏమీ పట్టించుకోడు. తన ఆనందం కోసం ఏమీ చేయడు.

అదేమంటే "ఆనందం అనేదాన్ని ఎవరికి వాళ్లు తమ మనసులలోనే సృష్టించుకోవాలి. ఒక మనిషి ఆనందం కోసం మరో మనిషి చేయగలిగినది చాలా తక్కువ ఉంటుంది" అంటాడు.

నిజమేనేమో! మాధవ్ పద్ధతి చూస్తే అలాగే అనిపిస్తుంది. మరి తనకెందుకు ఈ నిరాసక్తత!

అందరిమీదా చిరాకు, కోపం... చివరికి మా... ధ... వ్‌తో కూడా పోట్లాడుతోంది తను!

"ఎంత దారుణం! తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే మాధవ్‌తో కూడా పోట్లాడుతోంది!!"

రజని గుండెలోనుంచి వెచ్చటి నిట్టూర్పు దూసుకు వచ్చింది.

"నిన్న రాత్రి ఇలాగే బాధపడుతూ ఉంటే మాధవ్ చాలా సేపు బ్రతిమలాడాడు. తను లొంగలేదు. "నా సంగతి ఏమీ పట్టించుకోవడం లేదు. మీ సుఖమే మీరు చూసుకుంటున్నారు." అంది.

మాధవ్ అసహనంగా లేచి అవతలి గదిలోకి వెళ్లిపోయాడు. 'సదా ఏడుస్తూండాలని నువ్వు తీవ్రంగా నిర్ణయించుకున్న తర్వాత నీ ముందు నేను నవ్వుతూ తిరగడం వ్యర్థం. అది నిన్ను ఇంకా ఏడిపిస్తుంది. ఆ విషయం నా కిపుడే అర్థమయింది' అన్నాడు.

తెల్లవారాక కూడా తనని పలకరించలేదు. అతని పని అతను చేసుకుని ఆఫీస్‌కి వెళ్లిపోయాడు. తను కూడా చాలాసేపు మంచం మీది నుంచి లేవలేదు. తొమ్మిదయ్యాక అప్పుడు లేచి స్నానం చేసింది.

ఇంట్లో కూర్చుంటే పిచ్చెక్కుతుందేమో అనిపించింది.

ఎక్కడికి వెళ్లాలో అర్థం కాలేదు.

తాళం పెట్టి బయటకి వచ్చింది. కాళ్లు నడిపించినట్లుగా నడుస్తూ వస్తే కాలేజ్ కనిపించింది.

కాలేజ్ మెయిన్‌గేట్.... మొదటి మెట్టు తగలగానే రజని ఆలోచనల్లోనుంచి తెప్పరిల్లింది.

ఒక్కసారి శరీరం ఆపాదమస్తకమూ కంపించినట్లయింది.

ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ సాగిన మెట్లు... వాటికి రెండు వైపులా పూలకుండీలు...

ఏదో తెలీని భావంతో గుండె వణికింది.

మొదటి రౌండ్ మెట్లు ఎక్కి ప్రక్కకు తిరగగానే... కారిడార్‌లో నిలువెత్తు పెయింటింగ్. ఇందిరాగాంధీ బొమ్మ.

"ఎంత బాగుంటుందో ఈ పెయింటింగ్! దీని ముందు నుంచి వెళ్లినప్పుడల్లా ఓ రెండు నిమిషాలు తేరిపార చూస్తూండిపోయేది తను!"

అది గుర్తురాగానే రజని కళ్లల్లో చివ్వున నీళ్లుబికాయి. కానీ మనసులో ఏదో తేడాగా అనిపించింది. ఏమిటీ తేడా?

హఠాత్తుగా అర్థమయింది రజనికి.

మనసులోనుంచి దిగులు ఎగిరిపోతోంది. ఎప్పుడు వచ్చిందో ఎక్కడి నుంచి వచ్చిందో కానీ ఉన్నట్లుండి ఆనందం వచ్చి చేరుతోంది హృదయంలో! నిజం!

కాలేజ్ ఒక్కొక్క గోడనీ.... ఒక్కొక్క మూలనీ చూస్తుంటే మనసు ఆనందంతో కొట్టుకుపోతోంది.

ఎందుకిలా ఉంది?

చివరికి... ఈ కుండీల్లోని పూలూ.... వాటి మీదపడే లేలేత ఎండా కూడా సంతోషం కలిగిస్తున్నాయే!

ఎందుకు.... ఎందుకు!

సమాధానం దొరకడం లేదు రజనికి. ఇప్పటి వరకూ ఆనందం కోసం తపించింది. ఈ క్షణం దాన్ని అనుభవిస్తూంది.

కానీ అప్పుడూ, ఇప్పుడూ కూడా అసలు ఆ పదానికి నిర్వచనం ఏమిటో తెలీడం లేదు.

ఏమిటి! ఆనందం అంటే ఏమిటి?

ఇన్నాళ్లూ గుండెల్లో ఏదో అడ్డం పడినట్టూ.... కదిలిస్తే ఏడుపొచ్చేసేట్లూ... ఉండేదో.... ఆ ఫీలింగ్‌కి కారణమేమిటి!

ఇప్పుడు... ఏదో అద్భుతమైన పిట్ట గుండెల్లో ఎగురుతున్నట్లూ... సందడి చేస్తున్నట్లూ వుందే! సందర్భం కాకపోయినా పెదవులు నవ్వేందుకు ఆరాటపడుతూన్నాయే! ... ఈ ఫీలింగ్‌కి మూలం ఏమిటి?

అవును. అసలు ఆనందం అంటే ఏమిటి?

రజనికి అర్థం కావడం లేదు.

కష్టపడటంలోనూ, ఎదగడంలోనూ ఆనందం ఉందంటాడు మాధవ్. కానీ ఇప్పుడు ఇక్కడ తనేం కష్టపడింది? తనలో వచ్చిన ఎదుగుదల ఏముంది? తనని తనే ప్రశ్నించుకుంది రజని.

"ఉంది. ఉంది. ఎందుకు లేదూ! ఉంది." అంతరాత్మ ఉలికిపడినట్లుగా ఘోషించింది.

"ఈ క్షణం నువ్వేమీ కష్టపడకపోయి ఉండవచ్చు. ఈక్షణం నువ్వు ఎదిగి ఉండక పోవచ్చు. కానీ ఈ కాలేజ్ ఉందే... ఇది ఆ రెండింటినీ నీకు గుర్తు చేస్తోంది. ఇక్కడ చదివినపుడు నువ్వు ఎంతగా కష్టపడేదానివి! క్షణక్షణమూ ఎంతగా ఎదిగేదానివి?

ఎన్ని విజయాలు సాధించేదానివి! గుర్తు రావడం లేదూ? వాటన్నిటికీ సాక్ష్యంలా... దర్పణంలా.... ఈ కాలేజ్ నీకు కనిపించడం లేదూ?''

రజని కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "అవును. నిజమే.'' చుట్టూ పరికించి చూస్తూ అనుకుంది.

"ఇక్కడే ఈ ప్లే గ్రౌండ్‌లోనే ఇంటర్ కాలేజ్ కాంపిటీషన్స్ జరిగాయి. తనూ, సరితా టెన్ని కాయిట్‌లో ప్రైజ్ సంపాదించారు.

"ఎంత ఉత్సాహం! ఎంత కోలాహలం ఆ రోజు!

"అదిగో అక్కడే రంగోలీ కాంపిటీషన్ జరిగేది. ఎంత ఇంట్రస్ట్‌తో పార్టిసిపేట్ చేసేది తను రంగోలీ పోటీలలో!

"అదొక్కటనే ఏమిటి? ప్రతీపోటీలో అలాగే పాల్గొనేది.

"పెయింటింగ్.... ఎస్సే రైటింగ్.

"ఎలక్యూషన్‌లో అయితే తను చదివిన మూడేళ్లూ ఫస్ట్ ప్రయిజ్ తనకే.

"చివరికి... చివరికి ఒకసారి నిట్టింగ్ పోటీలో కూడా పార్టిసిపేట్ చేసింది.

"తన కసలు ఎంబ్రాయిడరీ చేయడమే రాదు. అయినా సరే పార్టిసిపేట్ చేసింది. అందరూ టకటకా ఎంబ్రాయిడరీ చేస్తుంటే... తను దారం చిక్కులూ, ముడులూ విప్పుకుంటూ కూర్చోవడం...!

ఆ సన్నివేశం తల్చుకుంటే ఫక్కున నవ్వొచ్చింది రజనికి.

పార్టిసిపేట్ చేసిన వాళ్లందరికీ ఒక కర్చీఫ్ ఇచ్చారు వాళ్లప్పుడు. ఎక్కడుందో అది! ఇంటికి వెళ్లి వెతకాలి.

రజని కళ్లలోకి నవ్వూ, నడకలోకి వేగమూ వచ్చాయి.

క్లాస్ రూంస్ అన్నీ దాటి లైబ్రరీ వైపు నడవ సాగింది. అప్పుడు కనిపించారు రా...జే...శ్వ...రీ మేడమ్!

గబగబా నడుస్తున్న వారల్లా ఒక్కసారి ఆగి, భ్రుకుటి ముడి వేసి చూసి, 'నువ్వు... రజని కదూ!' అన్నారు.

"ఎస్ మేడమ్'' మొహమంతా ఆనందంతో మెరుస్తుండగా చెప్పింది రజని.

"ఊ.. హౌ ఆర్ యు? ఏం చేస్తున్నావు? జాబ్ చేస్తున్నావా!'' బాణాల్లా వచ్చాయి ప్రశ్నలు.

"లేదు మేడమ్.''

"మరి! ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నావ్?'' ఆశ్చర్యం ధ్వనించింది ఆవిడ కంఠంలో. "కాలేజ్‌లో మాథ్స్ లెక్చరర్ పోస్ట్ ఖాళీగా ఉంది. పార్ట్ టైం జాబ్ చేస్తావా?''

"చేస్తాను మేడమ్'' స్పష్టంగా రజని.

"దెన్ గో అండ్ సీ మిస్టర్ శేఖర్.'' మాటకు తోడుగా చిరునవ్వు మెరిసింది ఆవిడ పెదవుల మీద.

అదే నవ్వు. రజనికి ఎంతో ఇష్టమైన నవ్వు. ఎలాంటి స్టూడెంట్‌కైనా స్ఫూర్తినిచ్చే నవ్వు.

రజని మైమరచి చూస్తూండగానే ఆవిడ క్లాస్ రూంలోకి నడిచారు. లోపలికి వెళ్లే ముందు డోర్ దగ్గర ఒక్క క్షణం ఆగి "గివ్ యువర్ అప్లికేషన్ అండ్ గో.'' అని హెచ్చరించారు.

రజని నవ్వుతూ తల ఊపింది.

లేడిలా చెంగుచెంగున మెట్లు దిగుతూ క్రిందకి వచ్చింది. శేఖర్ సార్ దగ్గరికి వెళ్లి, రెండు వైట్ పేపర్స్ అడిగి తీసుకుని, అప్లికేషన్ రాసిచ్చింది.

మరోసారి కాలేజ్‌ని తనివితీరా చూసి బయటకి నడిచింది.

ఒక్కసారిగా ప్రపంచమే మారిపోయిన ఫీలింగ్.

ఎటు చూసినా ఆనందం వెల్లి విరుస్తూన్న అనుభూతి.

కాలేజ్‌లోకి వెళ్లేటప్పటికీ, ఇప్పటికీ ఎంత తేడా!

"ఎందుకు ఇన్నాళ్లూ అంత బాధపడింది తను! ఎందుకు అలా నిరాసక్తత అనే ఊబిలో కూరుకు పోయింది!'' ఆశ్చర్యంగా అనుకుంది రజని.

"తన ప్రతి అసంతృప్తికీ, నిరాశకీ మాధవ్‌నే బాధ్యుడిని చేసి ఎందుకు ఆలోచించింది?

"అంతకు ముందు ఇరవై ఏళ్లు తను స్వతంత్రంగా బతికింది. అప్పుడు తనకంటూ ఓ ప్రపంచం ఉండేది. అందులో తను ఆనందంగా... చాలా ఆనందంగా ఉండేది.

ఆ విషయం ఎలా మరిచి పోయింది తను!''

తల్చుకుంటేనే చెప్పలేనంత చిత్రంగా అనిపించింది రజనికి.

"తనొక్కతే కాదు. చాలా మంది ఆడపిల్లలు అంతే. పెళ్లయే వరకూ ఎంతో హుషారుగా ఉన్నా వాళ్లూ, ఎన్నో సాధించిన వాళ్లూ కూడా పెళ్లయిన మరుక్షణం నుంచీ తమ ప్రతి ఫీలింగ్‌కీ భర్త మీద ఆధారపడిపోతారు. అతను నవ్వితే ఆనంద పడీ... అతను ముభావంగా ఉంటే టెన్షన్‌తో కదిలిపోయీ....

"ఎందుకు? ఎందుకలా?

"ప్రేమించవచ్చు. ప్రేమించడం తప్పు కాదు.

"ఆ మాటకొస్తే మాధవ్‌కి తనంటే ఎంత ప్రేమ! ప్రాణంలా చూసుకుంటాడు. అతని ప్రతి ఆనందాన్నీ, దుఃఖాన్నీ విజయాన్నీ తనతోనే పంచుకుంటాడు. అయితే ఆ ఫీలింగ్స్ కోసం తన మీద ఆధారపడడు.

"అవును....

"స్త్రీ అయినా, పురుషుడయినా అలాగే ఉండగలగాలి.

"హృదయం నిండా ప్రేమ నింపి జీవిత భాగస్వామికి అందివ్వగలగాలి. అంతే కానీ ఆ హృదయానికి కావలసిన ప్రతి భావం కోసమూ అవతలివారి మీద ఆధారపడకూడదు.

"ఇవ్వడంలో ఉండే ఆనందం తీసుకోవడంలో ఎలా దొరుకుతుంది!''

తనలోని మార్పుని మాధవ్ ఎంత ఆనందంగా రిసీవ్ చేసుకుంటాడో ఊహించుకుంటే రజనికి అద్భుతంగా అనిపించింది.

మంచం మీద తన పక్కగా చేరి....

ఎడమ చేయి నడుము చుట్టూ పెనవేసి... కుడి చేత్తో ముంగురులు సవరిస్తూ, "నాకు తెలుసు. నువ్వు చాలా గుడ్ గర్ల్‌వి'' అని మెచ్చుకుంటాడా!

గుండెల్లో తలదాచుకుంటూ "కాకపోతే కాస్త స్టార్టింగ్ ట్రబుల్ అంతే'' అంటాడా!

రజని పెదవులు మందార మొగ్గల్లా విచ్చు కున్నాయి.

కుడి చేయి అప్రయత్నంగా కుడి కంటి మీద ఆనింది. తల సిగ్గుగా భూమివైపు వంగుతుంటే బుగ్గల్లోని ఎరుపు ప్రతిఫలించిందేమో భూమి ఎర్రబడింది.

ఆమె కాంపౌండ్ దాటేస్తుంటే మరెవరో అమ్మాయి కాలేజ్ లోపలికి వెళ్తూ కనిపించింది.

ఆ పిల్ల కళ్లల్లో రజని ఆనందాన్ని చూసిన ఈర్ష్య స్పష్టంగా మెరిసింది.

❄

